'స్వర్ణముఖి'.. దుఃఖముఖి

- ఇసుకాసురుల దెబ్బకు రూపురేఖలు మారుతున్న నదీ ప్రాంతాలు
- చిగురుపాడు నది వద్ద జేసీబీలతో ఇసుక అక్రమ తరలింపు
- తవ్వకాలతో భారీ గోతులు తీస్తున్నా పట్టించుకోని అధికారులు





చిగురుపాడు స్వర్ణముఖి నది వద్ద ఇసుక తరలింపులకు బారులు తీరిన ట్రాక్టర్లు, స్వర్ణముఖి నది వద్ద పార్లుకట్టలను తెగ్గొట్టి ఇసుక అక్రమ రవాణాకు ఏర్పాటు చేసిన రాచమార్గం

నాయుడుపేటటౌన్: మండలంలో పలుచోట్ల స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ రవాణా ధాటికి రూపురేఖలు మారుతున్నాయి. పార్లుకట్టలను సైతం తెగ్గొట్టి, మట్టితో పాటు ఇసుకను రేయింబవళ్లూ అక్రమ రవాణా చేస్తూ, జేబులు నింపుకుంటున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో ఇసుకాసురులు పేట్రేగిపోతున్నారు. ఏకంగా జేసీబీలతో నదిలో ఇసుకను తవ్వి, ట్రాక్టర్లలో రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. మండలంలోని చిగురుపాడు వద్ద అ ఈ పనులు జోరుగా చేస్తున్నారు. మరోవైపు ఒక్క చిగురుపాడులోనే స్వర్ణముఖి నది వద్ద నాలుగు చోట్ల పార్లుకట్టలను తెగ్గొట్టి జోరుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అలాగే తిమ్మాజికండ్రిగ, మూర్తిరెడ్డిపాళెం, అయ్యప్పరెడ్డి పాళెం, అన్నమేడు, మర్లపల్లె, వెముగుంటపాళెం, పట్టణంలోని తుమ్మూరు, స్వర్ణముఖి నది కాజ్‌వే, ఏల్‌ఏ సాగరం, బీడీ కాలనీ తదితర చోట్ల స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి స్వర్ణముఖి ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టి, స్వర్ణముఖి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

'అన్నదాత సుఖీభవ'కు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఓ శ్రీదేవి

సైదాపురం: అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందడానికి రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని పొదలకూరు ఏడీ శ్రీదేవి కోరారు. మంగళవారం మండలంలోని అనంతమడుగు, వేములచేడులో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఆర్బీజీఎస్ వాలిడేషన్ అనంతరం ఆధార్ నంబర్ల ప్రకారం మండలంలో అర్హత కలిగిన 5,099 మంది రైతుల రికార్డులు మాత్రమే ఈకేవైసీ వచ్చినట్లు తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే రైతు సేవాకేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి హైమావతి, రైతులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

వాకాడు: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం ఆయన నెల్లిపూడి సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. వివిధ పనులపై వచ్చిన ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకుని సకాలంలో పనులు పూర్తి చేసి పంపాలని ఆదేశించారు.

అగ్రి గోల్డ్ భూముల పరిశీలన

దొరవారిసత్రం: మండలంలోని అగ్రి గోల్డ్ భూములను మంగళవారం సీఐడీ అధికారులు పరిశీలించారు. అక్కరపాక రెవెన్యూ పరిధిలో వివిధ సర్వే నంబర్లలో 101 ఎకరాల అగ్రిగోల్డ్ భూములు ఉన్నాయి. సీఐడీ ఆధీనంలో ఈ భూములను నెల్లూరు నుంచి తిరుపతి జిల్లా సీఐడీ అధికారులకు ఇటీవల బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఈ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి? ప్రస్తుతం వాటి స్థితిగతులేమిటో తెలుసుకునేందుకు తిరుపతికి చెందిన సీఐడీ అధికారులు స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారుల సాయంతో పరిశీలించారు.

ఎంఈఓ టీచరైన వేళ..!



విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

రాపూరు: మండలంలోని రామదేవిపల్లె ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ శ్రీనివాసులు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు టీచర్ అవతారం ఎత్తారు. పాఠం చెప్పి ప్రశ్నలు సంధించారు. సమాధానాలు రాబట్టారు. సకాలంలో సిలబస్ పూర్తిచేయాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని టీచర్లను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు.

పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి

సైదాపురం: పరిసరాల శుభ్రతకు స్థానికులు సహకరించాలని ఎంపీడీఓ నవీంద్రబాబు కోరారు.సైదాపురంలో ఇంటింటా చెత్త సేకరణను మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, సంపద కేంద్రానికి తరలించి, వర్మీ కంపోస్టు తయారు చేసి, పంచాయితీ ఆదాయ వనరులను పెంచాలని కార్యదర్శి రాఘవేంద్రను ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి శశిఇంద్రాణి పాల్గొన్నారు.

చికెన్ ధరలు		15.07.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	116
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	234
లేయర్ చికెన్	:	190

ఎన్‌బీకేఆర్‌లో ఘనంగా జ్యోతి డే



నేదురుమల్లి బాలక్రిష్ణారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల్లో మంగళవారం 90వ జ్యోతిడే ఘనంగా నిర్వహించారు. దివంగత, పద్మశ్రీ నేదురుమల్లి బాలక్రిష్ణారెడ్డి విగ్రహానికి అధ్యాపకులు, సిబ్బంది నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. నేదురుమల్లి బాలక్రిష్ణారెడ్డి ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలకు బీజం వేసిన రోజును ప్రతి ఏటా జ్యోతిడేగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూరిగుడిసెలో, రాత్రి పాఠశాలతో ప్రారంభమైన విద్యా సంస్థ అంచెలంచెలుగా ఎదిగి వేలాది మందికి విద్యను అందిస్తోందని, జాతీయస్థాయిలో పోటీ పడుతోందని పేర్కొన్నారు. ఇక్కడ చదివిన వారు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత చదువులతో మంచి భవిష్యత్తు

వాకాడు: ప్రతి విద్యార్థి ఉన్నత చదువులతో మంచి భవిష్యత్తు సొంతం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల 90వ జ్యోతి డే పురస్కరించుకుని వేడుకలు నిర్వహించి ఆయన మాట్లాడారు. వాకాడులో నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నేదురుమల్లి హిమకుమార్ రెడ్డి, హెచ్ఎం ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తులు ధ్వంసం చేసినా కేసులు నమోదు చేయరెందుకు..?

- నల్లపరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం
- పరామర్శలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్
- వ్యవస్థల్ని మేనేజ్ చేస్తున్న కూటమి నాయకులు మూల్యం చెల్లించకతప్పదు



నల్లపరెడ్డి పసన్నకుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నరేంద్రరెడ్డి

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలో నల్లపరెడ్డి కుటుంబానికి మంచి గుర్తింపు ఉందని, అలాంటి కుటుంబానికి చెందిన మాజీ మంత్రి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఇంటిపై గంజాయి మూకలు దాడులు చేసి, ఆస్తులు ధ్వంసం చేసినా ఇప్పటి వరకు కేసులు నమోదు చేయకపోవడం శోచనీయమని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మేరిగ మురళీధర్ ఆగ్రహం చేశారు. ఇటీవల నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతికి శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో నెల్లూరులో ఆయనను ఎమ్మెల్సీతో పాటు గూడూరు రూరల్ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దల నరేంద్రరెడ్డి కలిసి పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకుని పైవిధంగా మాట్లాడారు. దాడి చేసిన వారు ఎవరనేది రికార్డింగ్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం గర్హనీయమన్నారు. నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డికి గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని అన్నారు. వ్యవస్థలను కూటమి నాయకులు తమ చేతుల్లోకి తీసుకుని పాలన చేస్తున్నారని, దీనికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. వీరితోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు.

పారిశుద్ధ్యంపై కేంద్ర బృందం తనిఖీ



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, మరుగుదొడ్ల నిర్వహణపై మంగళవారం కేంద్ర బృందం పరిశీలించింది. కలువాయిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లేకపోవడంతో బృందం అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనిపై ఎంపీడీఓ భవానిని ప్రశ్నించింది. దీంతో హుటాహుటిన పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లతో చెత్తను తొలగింపు పనులకు పూనుకున్నారు. కలువాయి బస్టాండ్ సెంటర్ మరుగుదొడ్లను, బీవీఎన్ఆర్ జెడ్పీ హైస్కూల్‌లోని మరుగుదొడ్లను కేంద్ర బృందం పరిశీలించింది. ఎందుకు చెత్త సేకరణ చేయడం లేదని ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్‌కాల్‌లో తవారు మండల అధికారులను ప్రశ్నించారు. మరుగుదొడ్లను విధిగా వాడుతున్నారా, లేదా? అని గ్రామస్థాయిలో విచారణ చేశారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు చెంచుమల్లికార్జున్

వెంకటగిరి రూరల్: కుటుంబ పోషణ కోసం మామిడికాయల లోడు కూలీ పనులకు వెళ్లి అన్నమయ్య జిల్లా, పుల్లంపేట మండలం రెడ్డిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గిరిజన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచుమల్లికార్జున్ డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మునిచంద్ర కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రెక్కాడితేగానీ డొక్కాడని గిరిజన కుటుంబాలకు చెందిన మండలంలోని వల్లివేడు ఎస్టీకాలనీకి చెందిన మునిచంద్ర (19), కలవగుంటకు చెందిన చిట్టెమ్మ, గుండపల్లెకు చెందిన శ్రీను ఈ ప్రమాదంలో మరణించడంతో వారిపై ఆధారపడిన కుటుంబాలు అనాథలయ్యాయన్నారు. చిట్టెమ్మ మృతితో ఆమె ఐదుమంది పిల్లలు ఆలనాపాలనా చూసుకునేవారు లేరని, మృతి చెందిన గిరిజన కుటుంబాలకు రూ. 20లక్షలు ఎక్స్‌గ్రేషియా, గాయపడిన కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు మోపూరు అదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



రాపూరులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాపూరు: స్థానిక షాదీ మంజిల్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి మంచి స్పందన లభించిందని వైద్యులు కందుకూరు చంద్రశేఖర్, కందుకూరు మస్తాన్‌బాబు తెలిపారు. నెల్లూరులోని స్మార్ట్ విజన్ కంటి ఆస్పత్రినిర్వహించిన ఈ శిబిరంలో 156 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితం మందులు అందజేశారు. అలాగే ఎంపిక చేసిన 15 మందికి నెల్లూరులో బుధవారం ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య బృందం విజయభాస్కర్,రాంబాబు,సందీప్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ ముఖ్యం



మాట్లాడుతున్న రూరల్ సీఐ కిశోర్‌బాబు

చిల్లకూరు: చిన్నతనం నుంచే క్రమశిక్షణ కలిగి ఉండాలని గూడూరు రూరల్ సీఐ కిశోర్‌బాబు అన్నారు. స్థానిక శారదనగర్‌లోని ఎల్‌పీపీ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల ఎన్నికలలో గెలుపొందిన వారికి పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కారాదని హితోక్తులు పలికారు. అలాగే తల్లిదండ్రులు మైనర్లకు బైకులు ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సుధేష్ణ, దయాకర్, సురేష్, నంద తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ మహాసభను జయప్రదం చేయండి

గూడూరు రూరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 17న నిర్వహించ తలపెట్టిన మహాసభకు బీసీలు తరలివచ్చి జయప్రదం చేయాలని రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పెరుమాళ్ల పద్మజ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్ పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్, మహిళా రిజర్వేషన్‌లో ఓబీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడంతో పాటు బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు.


జీతాలు పెంచాలని సమ్మె బాట



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్ విభాగ కార్మికులు, నాయకులు

నాయుడుపేటటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ కార్మికులు మంగళవారం నుంచి సమ్మె బాట పట్టారు. కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఆందోళనకు నేతృత్వం వహించి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు వి.చెంగయ్య మాట్లాడారు. కార్మికుల జీతాలు పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు పూనుకున్నట్లు చెప్పారు. జీతాలు పెంచే వరకు సమ్మె విరమించేది లేదని ప్రకటించారు. పారిశుద్ధ్య కార్మికులు కూడా సమస్యలపై బుధవారం నుంచి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, ఇంజినీరింగ్ విభాగ కార్మిక సంఘ నాయకులు నాగరాజు, శీనయ్య, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పారిశుద్ధ్య కార్మికుల సమ్మె



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు

చిల్లకూరు/గూడూరు రూరల్ : పారిశుద్ధ్య కార్మికులకు ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏడాది పూర్తయినా నెరవేర్చకపోవడంతో బుధవారం నుంచి గూడూరులో సమ్మెకు పూనుకుంటున్నట్టు పారిశుద్ధ్య కార్మికులు గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు మంగళవారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఇంజినీరింగ్ కార్మికులు మూడు రోజుల నుంచి సమ్మె చేస్తున్నారని, తమ డిమాండ్ల సాధన కోసం తాము సైతం ఆందోళన చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దారా కోటేశ్వరరావు, జోగి శివకుమార్, బీవీ రమణయ్య, సాయి, రాఘవ, భాస్కర్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

దారి మళ్లుతున్న 'గంగ'..రైతుల్లో బెంగ

- పంటలకు నీరందక అవస్థలు

కోట: మండలంలోని మెట్ట ప్రాంతాల్లో సాగులో ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. చిట్టేడు, కేసవరం, రాఘవాపురం, మద్దాలి ప్రాంతాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేశారు. అయితే వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగుగంగ నీటిని ఉన్నతాధికారులు విడుదల చేశారు. అయితే కొందరు రైతులు గంగ నీటిని అనధికారికంగా, ఇష్టానుసారంగా మళ్లించుకుంటున్నారని, దిగువ ఆయకట్టుకు నీళ్లు చేరడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు దీనికి అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. దీనిపై తెలుగుగంగ ప్రాజెక్ట్ ఏఈ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. సిబ్బంది కొరత కారణంగా పర్యవేక్షణ కొరవడిందని, కాలువల్లో నీటి ప్రవాహాన్ని ఎవరైనా అడ్డుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

- నేడు వెంకటగిరికి నేదురుమల్లి రాక

సైదాపురం: వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం వెంకటగిరిలోని తన నివాసంలో మధ్యాహ్నం 3 నుంచి కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటారని ఆయన కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

- నేడు 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

తడ: 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక పున్నమి అతిథి గృహంలో నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కే ఆర్ముగం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరవుతారని, మండలంలోని పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రెవెన్యూ సిబ్బందిపై ఆర్డీఓ ఆగ్రహం

కలువాయి(సైదాపురం): కలువాయి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆత్మకూరు ఆర్డీఓ పావని రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. రీ-సర్వేకు సంబంధించి బ్రాహ్మణపల్లె, ఎర్రబల్లి, వీఎస్‌లాగిన్లు పూర్తయ్యాయా, లేదా? అని సిబ్బందిని ప్రశ్నించారు. కల్లూరులో ఆక్రమణలు జరుగుతున్నట్లు పత్రికల్లో కథనాలు వస్తుంటే ఏం చేస్తున్నారని ఆర్ఐపై ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తహసీల్దార్‌ను ప్రశ్నించారు. కలువాయి మండల సిబ్బంది తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలకు సంబంధించి విధిగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని ఆదేశించారు.

దాచూరు ముంపు ప్రాంతం పరిశీలన

చౌటపల్లె, రిజర్వాయర్ సంబంధించి ముంపునకు గురవుతున్న దాచూరు ప్రాంత పొలాలను రెవెన్యూ సిబ్బందితో కలసి ఆర్డీఓ పరిశీలించారు. తహసీల్దార్ శ్యాంసుందర్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వేయర్లు ,వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన





పింక్ బస్సుతో వైద్య సిబ్బంది, గొట్టిప్రోలు పీహెచ్‌సీలో ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సూళ్లూరుపేట/నాయుడుపేట : మండలంలోని పేర్నాడు, నాయుడుపేట మండలం గొట్టిప్రోలు పీహెచ్‌సీలలో మంగళవారం స్విమ్స్ వైద్య బృందం పింక్ బస్సుల్లో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించింది. కాన్సర్ లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలు గురించి తొలుత వైద్యులు అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలు చేసినట్లు స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజు చెప్పారు. అలాగే 17న తడ, రామాపురం పీహెచ్‌సీ పరిధిలో, 18న చిట్టమూరు మండలం మల్లాం, ఈశ్వరవాకలో ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పేర్నాడు వైద్యాధికారులు డాక్టర్ జయశ్రీదేవి, డాక్టర్ రమణయ్య, గొట్టిప్రోలు వైద్యాధికారి డాక్టర్ శంకరయ్య, స్విమ్స్ మెడికలాఫీసర్లు డాక్టర్ చైతన్య భాను, డాక్టర్ పద్మావతి, హెచ్ఈఓలు రవికుమార్, రాజెమ్మ, సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, గోపీకిరణ్, గోపాల్, ఎంఎల్‌హెచ్ స్వప్న, ఆశా వర్కర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కండలేరులో 29.901 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 29.901టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. ఇక్కడ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1675, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 90, మొదటి బ్రాంచ్ కాలువకు 65 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.